అలసి సొలసి పోయింది సాయంత్రం. అటు పూర్తి వెలుతురుగాక, ఇటు పూర్తి చీకటిగాకుండా వుంది. తల్లి రెక్కల కింద నుంచి కళ్ళుమూస్తూ, తెరుస్తూవున్న కోడిపిల్ల కంటికి కనిపించే తీరుగా సాయంత్రం వుంది.

ఎడమ చేతిని నుదురుకు పెట్టుకుని, కుడిచేతిలోవున్న క్రర పుల్లతో భూమ్మీద గీతలుగీస్తూ, విచారంతో ఆ యింటి గడప దగ్గర కూర్చున్నది సరస్వతి.

# సంధి

## వుప్పల నరసింహం

సరస్వతికి పెళ్ళయి నెల రోజులే అయింది. ఆ అమ్మాయి వయసు దాదాపు పదిహేను సంవత్సరాలు. పెళ్ళినాటి తెల్లచీరను నాలుగుసార్లు ఉతికి కట్టుకునేసరికి అలుకు పిడచలా తయారయింది. తెల్లచీర ఎర్రంచు లోని మెరుపు మాయమయింది. ఆ చీరతోపాటు తొడుక్కున్న పసుపురంగు రవికె సైతం రంగు వెలసినట్టుగా వుంది. వదులుగా వుంది. మెడలోని పసుపు తాడు మాత్రం కొత్తగా మెరుస్తోంది. కొంగుచాటు నుంచి ఎర్ర పగడం, నల్లపూసలు, కొత్త బంగారపు పుస్తె మసగ్గా కనిపిస్తున్నాయి. ముక్కుకు ముత్యపు ముక్కు పుల్ల, చెవులకు నెమలి కంటి కమ్మలు; ఇవన్నీ సరస్వతికి అలంకరణగానే వున్నాయిగాని ఆమెకు పొందికగా అద్దినట్టులేవు.

కాళ్ళకున్న సన్నటి వెండి మెట్టెలు, లావుగా వున్న కడియం ఎడమ కాలికే కనిపిస్తూ వున్నాయి. సరస్వతి కుడికాలు ముడుచుకుని ఏదో కోల్పోయిన దానిలా కూర్చుంది.

సరస్వతి శరీర ఛాయ సామనలుపు. విచారంతో ఏదో ఆలోచిస్తూ వంటరిగా కూర్చోవడంతో మరింత నలుపు జతపడినట్టుగా వుంది. దానికి తోడు ఆ అమ్మాయి తుమ్మకాయలతో చేసిన కాటుకను కళ్ళకు అంటీ అంటనట్టు పెట్టుకుని, ఆ కాటుకనే బొట్టుగా పెట్టుకుంది.

ఆ అమ్మాయి పొంగిన చెంపల్లోని నిగ్గు మబ్బుచాటు చంద్రుని కాంతిలాగే వుంది. కళ్ళలోని తెల్లని కనుపాప మాసినట్టుగానే మారింది. చెవుల దగ్గరినుంచి తల వెంట్రుకలు గదవ వరకు పాకినయ్...

సరస్వతి గంటనుంచి అలాగే మౌనంగా కూర్చుండి పోయింది.

వారం రోజుల క్రితమే తన అత్త ఆండాలు, సింగాయపల్లి నుంచి తనను తీసుకొచ్చింది. వచ్చిన నాటినుంచి నిన్నటి వరకు తనకు కొత్త ఊరికి వచ్చినట్టుగానే వుంది. ఇల్లు, మనుషులు, పరిసరాలు, అలవాట్లు పద్ధతులు, తినే తిండి, మాటతీరు అన్నీ కొత్త కొత్తగానే వున్నాయి. మనసులో ఇరుకు ఇరుకే అనిపించినప్పటికీ తన మరదలితో, పక్కింటి పిల్లలతో ఆడుతూ పాడుతూ వొచ్చింది. తన అత్త, మామ, భర్త కళ్ళకు కనిపించనంతసేపూ సింగాయపల్లిలో మెదిలినట్టు గానే మెదిలేది. వాళ్ళు కనిపించిన క్షణంలో బిర్ర బిగుసుకుపోయి, చూపులను సైతం తెచ్చిపెట్టుకునేది. కనిపించని గొలుసులేవో తనపైన విసురుతున్నట్టనిపించేది. గుర్రం పిల్లని కళ్ళెంవేసి లాగినట్టు, ఆవును పగ్గమేసి అదుపుచేసినట్టు అనిపించింది. వారం రోజుల క్రితం నుంచి నిన్నటి వరకు చిన్న పిల్లలు దాగుడు మూతలు ఆడినట్టు, దొంగాట ఆడినట్టుగానే గడిచింది. నిన్న రాత్రి మాత్రం నిండు నీళ్ళకుండ కిందపడినట్టు అనిపించింది.

నిన్న మంచి రోజని ఆండాలు యింట్లో అలుకు పూత చేసింది. రాత్రి కోడలు సరస్వతిని, కొడుకు సాంబయ్యను 'అర్ర'లోకి పంపింది.

ఆ అర్రలో మూడు వైపులా పెద్ద పెద్ద కాగులు, కుండలు వున్నాయి. సరస్వతి పెళ్ళినాటి ఐరేని కుండ కూడా అందులోనే వుంది. ఆ కుండ మీది ముగ్గులు, చిలకలు తనవైపే చూస్తున్నాయి. మరో మూలకు ఓ పాత చెక్కపెట్టె. మరో రెండు తుప్పపట్టిన పెట్టెలు వున్నాయి. దూలం నుంచి వేలాడుతున్న వుట్టిలో ఓ ముంత వుంది. అందులో ఏవో గింజలున్నట్టున్నాయి. సూరులోంచి ఎలుకలు కిసకిసమంటూ పరుగెత్తుకొచ్చి ఆ గింజలను తింటూ వున్నాయి. గోడకున్న మేకుకు ఓ బట్టల మూట తగిలేసి వుంది. ఆ అర్రలోకి ఎటునుంచీ గాలి వచ్చే మార్గమే లేదు. ఏమి వచ్చినా ఎలుకలు చేసిన సూరు సందుల్లోంచి రావలసిందే! ఆ అర్ర తలుపు పక్కనే ఎరుకలి 'గుమ్మి' వుంది. అందులో పది బస్తాల వడ్లు పడతాయేమో? మనిషి కూర్చున్నా కనపడకుండా లోతుగా వుంది. వారం రోజుల్లో వెలుతురు పూటనే ఆ అర్రలోకి కాలుపెట్టిన సరస్వతికి, రాత్రి ఏదో మూల చిన్నగా ఎర్రని కాంతి నిస్తున్న దీపం వెలుతురులో అందులో కాలు పెట్టేసరికి జంకుగా వుంది. అందులోనూ చెట్టంత మనిషిలావున్న తన భర్త సాంబయ్య ముందు తనకు తాను పిట్ట పిల్లలా అనిపించింది.

అంతేగాకుండా ఆ కనిపించీ కనిపించని వెలుగులో ఆ అర్రలోని కాగులు, కుండలు, గుమ్మి, పెట్టెలు, భర్త...పైన తిరుగుతున్న ఎలుకల చప్పుడు,,,,బయట ఎక్కడో అదేపనిగా కుక్కలు మొరగడం, ఎంత చెట్టు తొర్రలోని గుడ్లగూబ అరుపు, బయట అరుగుమీద పడుకున్న తన మామ చంద్రయ్య దగ్గు, పగ్గం తెంపుకున్న దూడ అరుపు, కోళ్ళగూడు వద్ద పిల్లి చప్పుడుకు కోళ్ళు మేల్కొని బెదిరిన అరుపులు, పాడుబడ్డ గోడల్లో గాడిద ఓండ్ర...

ఆ వాతావరణానికి, ఆ చప్పుళ్ళకి సరస్వతికి చల్లటి చెమటలు పట్టినాయి. తన ఊహకు ఎప్పుడూ రాని పరిస్థితి. ముందుకు అడుగెయ్యాలో...వెనక్కి కదలాలో తెలియని స్థితి. ఏడవాలో? ఎక్కడికైనా పరుగెత్తాలో అర్థంకాని పరిస్థితి-మెదడు పనిచేయడం మానేసినట్టయింది.

తన చిన్నప్పటినుంచి తన తల్లిదగ్గరగాని, తనతోటి ఆడపిల్లలతోగాని, తనకన్నా చిన్న పిల్లలతోగాని కథలు చెప్పుకుంటూ పడుకుందేగాని, ఇలా ఓ అర్రలో చెట్టంత మనిషి పక్కన పడుకోడం తలవని తలంపే...

నోట మాటరాక అలాగే బిర్రబిగుసుకుపోయిన సరస్వతి చూపులన్నీ నేలను తొలుస్తూవున్నాయి. ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. బొమ్మలా నిల్చున్న సరస్వతిని సాంబయ్య కొద్దిసేపు రెప్పవేయకుండా చూసి చూసి చూసి తన బలమైన చేతుల్తో సరస్వతిని పొదిమి పట్టుకుని, కింద చాపమీద పరచిన పాత బొంతలోకి తీసుకెళ్ళాడు. తలగడగా వున్న చిన్న బట్టల మూటపైన



సరస్వతి తలను ఆన్చింది...

సరస్వతి వొంటినిండా రోమాలు నిక్కబొడిచాయి. పంటికింద బాధనంతా నొక్కిపట్టింది. ఆపైన ఏం జరిగిందో ఆ అమ్మాయికే పూర్తిగా తెలియదు.

కోడి కూసినప్పుడు సరస్వతికి మెలుకువవచ్చింది. వొళ్ళు పచ్చి పుండయింది. బలవంతంగా లేచి గోడకు ఆనుకుని, మోకాళ్ళు దగ్గరికి లాక్కుని కూర్చుంది. నిద్ర రావడం లేదు. మూలన వుండే దీపం ఆరిపోయింది. అగ్గి పెట్టె ఎక్కడుందో తెలియదు. చీకట్లో కళ్ళు తెరిస్తే ఎదురుగా అనేకానేక ఆకారాలు కనిపిస్తున్నాయి. తాను యింతకు క్రితం ఎక్కడో చూసిన ఆకారాలు, మరికొన్ని జంతువుల ఆకారాలు, యింకొన్ని తాను చెప్పుకున్న కథల్లోని పాత్రల ఆకారాలు కనిపిస్తున్నాయి. ఏవో ఆకారాలు కదులుతున్నట్టనిపించసాగింది. ఐరేని కుండపైని ముగ్గులు పాముల్లా, చిలకలు డేగల్లా కనిపించసాగాయి. దూలంపైకి చల్లిన సున్నం మరకలు తేళ్ళలా, ముంగీసల్లా కనిపించసాగాయి. అలా అనేకం ఊహకురాగానే మనసులో భయమనిపించింది. కళ్ళు మూసుకుంది. వెంటనే కళ్ళు తెరచి భర్త సాంబయ్య వున్నాడేమోనని చూసింది. కాని లేదు. అప్పటికే లేచి వెళ్లినట్టుగా వుంది.

సరస్వతి తిరిగి కళ్ళు మూసుకుంది. ధైర్యం తెచ్చుకోవడం కోసంగాను మనసంతా బయటనుంచి వినిపిస్తోన్న కోడి కూతపై, పశుల కలవరింతలపై, కుక్క మొరగడంపై, దూరంనుంచి వినిపిస్తున్న దగ్గుపై, మరీ దూరంనుంచి రోడ్డుపై పోతున్న లారీల చప్పుడుపై నిలిపింది. శరీరమే కాదు మనసుకూడా ముద్దలా అనిపించసాగింది. మెదడు మొద్దుబారినట్టు అనిపించింది. ఒకే విషయం చుట్టూ మనసు గిరికీలు కొడుతూ అలసి సొలసి పోయింది. ఆలోచనలు మోటకు కట్టిన పశువుల్లా అక్కడే ముందుకి, వెనక్కి కదులుతూ వున్నాయి. దూరంగా మోటకొడుతున్న మేతుకు మొగిలయ్య పాట సన్నగా వినిపిస్తోంది.

తెల్లవారింది.

పాడుబడిన గడీలో, చచ్చిన పాములా కాకున్నా కోరలు పీకేసిన పాములా, ఒకప్పుడు దొరతనం వెలిగించిన 'దొర' ప్రతాపరెడ్డి గడీలో సాంబయ్య పేడతీస్తూ వున్నాడు. నోట్లో పలగార వుంది. తలనిండా రాత్రి ఆలోచనలే, జ్ఞాపకాలే. ఎవరితోనైనా చెప్పుకోవాలని వుంది. కాని ఎలా చెప్పుకునేది? అనుకోకుండానే మొఖంలో నవ్వు మెరుస్తూ మాయమవుతూ వుంది.

ఆ క్షణంలో పెళ్ళి కోసం చేసిన అప్పుగాని, తెచ్చిన తిండిగింజలుగాని ఏవీ జ్ఞాపకం రాలేదు. ఎర్రటి దీపం వెలుతురులో బొమ్మలా నిల్చున్న సరస్వతి తన భార్య మొఖం కనిపిస్తోంది.

సరస్వతిలో ముందురోజువున్న ఉత్సాహం లేదు. చలాకితనం కళ్ళల్లో కానరాలేదు. మౌనంగా వుంది. కంటినిండా నిద్ర లేదేమో అని అత్త ఆండాలు సరిపెట్టుకుంది.


సరస్వతి చురుగ్గా గాక అలసి సొలసి నట్టుగానే తిరిగింది ఉదయం నుంచి.

రాతిరి జరిగినదంతా ఒక ఎత్తు కాగా, ఆ రోజు మధ్యాహ్నం జరిగిన సంఘటన ఇంకో ఎత్తయింది...

సరస్వతి మామ చంద్రయ్య పశువులను తీసుకుని అడవికి పోయాడు. అత్త ఆండాలు, మరదలు పుష్ప వరినాట్లకు పోయారు. కొత్త పెళ్ళి కూతురని సరస్వతిని మాత్రం యింటి వద్దనే వుండమని 'సద్ది' కట్టుకుని పోయారు. శరీరమంతా నొప్పిగా వుందని గడప వద్ద ఎండకు కూర్చుని సన్నటి దువ్వెనతో పేలు తీసుకుంటున్నప్పుడు తన భర్త సాంబయ్య భోజనానికని ఉషారుగా వచ్చాడు. కిందికి తలవేసి పేలు తీస్తున్న సరస్వతి పాదాలు కనిపించి పైకి చూసేసరికి చెట్టంత మనిషి, భర్త సాంబయ్య కనిపించే సరికి ఖంగుతిన్నది. గబగబా వెంట్రుకలను ముడుచుకుని, దువ్వెనను గూట్లో పెట్టడానికి ఇంట్లోకి నడిచింది.

సాంబయ్య ఆమె వెనకాలే అడుగులేసి అమాంతం ఆమెను పొదివి పట్టుకుని అర్రలోకి తీసుకెళ్ళాడు. సరస్వతికి ఏడుపొచ్చింది. గిర్రున కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మనసు తన స్థానం తప్పినట్టయింది. ఏమి చేయాలో తెలియకుండా వుంది. అయినంత వరకు తన భర్తకు దూరం జరగాలనే ప్రయత్నిస్తూ వుంది. కాని

## రచయిత గురించి



సికిందరాబాద్ నగరానికి దాదాపు ఇరవై కిలో మీటర్ల దూరంలో వున్న దేవర యాంజాల్ గ్రామంలో 3-1-1955 (స్కూలు రికార్డుల ప్రకారం) పుట్టి, పెరిగారు పుష్పాల నరసింహం. హైస్కూల్ చదువు అదే గ్రామంలో కొనసాగింది.

హైస్కూల్ దశలోనే రచనా వ్యాసంగంపై అభిరుచి పెంచుకుని, 'ఆర్ట్ లవర్స్' సాహితీ సాంస్కృతిక సంస్థలో చేరి కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. ఆ తరువాత 'జన నాట్య మండలి' వ్యవస్థాపక సభ్యుడిగా కృషి చేశారు. అలాగే వివిధ విద్యార్థి ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆర్ట్సులో డిగ్రీ పొందారు.

కొంత కాలం హైదరాబాద్‌లో డి. వెంకట్రామయ్య గారింట్లో ప్రతి ఆదివారం జరిగిన సాహితీ సమావేశాల్లో కథలు చదివి మెప్పు పొందారు.

1977 నుంచి 80 వరకు హైదరాబాద నుంచి వెలువడే ఓ దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. అదే సమయంలో చైతన్య చిత్ర ఇంటర్నేషనల్ సంస్థ 'మా భూమి' చిత్ర నిర్మాణంలో పాల్గొన్నారు.

ఆ తర్వువాత అదే సంస్థలో చేరారు... జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న 'రంగుల కల' చిత్ర నిర్మాణంలో క్రియాశీలక పాత్ర వహించడమేకాకుండా, స్క్రిప్టులో పని చేశారు. అలాగే ఫిలిం సొసైటీ ఉద్యమంలో పాల్గొని కొన్ని వ్యాసాలను ప్రకటించారు.

1983లో 'తిరగబడ్డ భూమి' కథల సంపుటి యుగ ప్రచురణగా వచ్చింది. అలాగే ప్రముఖ దర్శకుడు బాపుచే 'జ్యోతి' కథల పోటీలో బహుమతి అందుకున్నారు.

ప్రస్తుతం 'రంగుల కల' చిత్రం నిర్మించిన సుచిత్ర ఇంటర్నేషనల్ యూనిట్ సభ్యుడిగా పని చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి' (హైదరాబాద్ ఎడిషన్) దినపత్రికలో తెలంగాణా పల్లె ప్రజల జీవితాలను వాళ్ళ 'స్వగతా'ల రూపంలో రాస్తున్నారు. "తెలంగాణాలోని భూస్వామ్య అహంకారం, ప్రజల అమాయకత్వం నన్ను నన్నుగా వుండనీయడం లేదు" అంటున్నారు.

భార్య విశ్వకళ, కొడుకు కాంతి, ఇతర కుటుంబ సభ్యులతో పాటు దేవర యాంజాల్ గ్రామంలో 'కాంతి కుటీరం'లో వుంటున్నారు.

సాహిత్యంలో ప్రేమ్‌చంద్, సినిమాల్లో సత్యజిత్ రే అంటే యిష్టం. విరసం సభ్యుడు.

---

అది తనతో అయ్యే పనేనా? తలనిండా జుట్టు, కోర మీసం, బలమైన చేతులు, చెట్టంత మనిషి... తాను పిట్టపిల్ల...గిల గిల కొట్టుకుంది మనసు...

చీకటి అర్రలో సాంబయ్యకు సరస్వతి కన్నీరు కనిపించనే లేదు.

అరగంట తర్వాత తన భర్త తిని పోయిందగ్గర్నుంచి సరస్వతి అలాగే విచారంగా, మౌనంగా, భూమ్మీద గీతలు గీస్తూ కూర్చుండి పోయింది. ఎడమ చేతి కున్న కొత్త ఎర్ర గాజులను పైకి కిందికి జరుపుకుంటూ, కాలికున్న మెట్టెలను తిప్పుతూ, చీర అంచులోని మెరుపును లాగేస్తూ, నల్ల చీమల బారు నడక తీరును గమనిస్తూ, అప్పుడప్పుడూ తమాషా కోసం వాటి దారిలో అడ్డు పుల్ల వేస్తూ, ఇంట్లోకి వెళ్ళబోయే కుక్కను అదిలిస్తూ, దగ్గరి కొచ్చి నిల్చున్న పిల్లిని నిమురుతూ ఆలోచనలో పడింది.

తననో బందిఖానాలో వేసినట్టనిపించింది. చెరసాలలోకి తరిమినట్టుగా వుంది. పెరిగిన దూడను ఆవు నుంచి దూరం చేసినట్లనిపించింది. తల్లినీడ వదలని మేక పిల్లను తరలించుకు పోయి మరో చోట కట్టేసి నట్టనిపించింది.

దీనికి ఎవరు కారణమో తెలియడం లేదు. ఎవర్ని తప్పు పట్టాలో తెలియడం లేదు. ఏమని, ఎవరికి చెప్పుకోవాలో అర్థమవడం లేదు. అత్త ఆండాలును తిట్టాలో? తల్లిని తిట్టాలో తెలియడం లేదు. అంతా అస్పష్టంగా, గజిబిజిగా వుంది. ఆలోచనలన్నీ మేకలు కొరికిన చీర తీగల్లా అక్కడక్కడే వుండి పోతున్నాయి. ఏదీ కొసకు చేరడం లేదు. ఆలోచించిన విషయాన్నే ఆ కొస నుంచి, ఈ కొసకు; ఈ కొస నుంచి, ఆ కొసకు లాగుతుందే గాని; వున్న విషయాన్నే ముందుకేసి, వెనక్కేసి తడుముతుందే కాని అంతు దొరకడం లేదు.

చీకటి పడుతోంది.

కోడి పిల్లలు గూటి దగ్గరి కొచ్చి క్యార్ క్యార్ మంటూ వున్నాయి. కుక్క దడి దగ్గర తిరుగుతూ వుంది. పిల్లి వళ్ళు విరుచుకుంటూ సరస్వతిని రాసుకుంటూ, ఇంట్లోంచి బయటకు, బయట నుంచి ఇంట్లోకి తిరుగుతోంది. చెట్లపైన పక్షులు అరుస్తూ వున్నాయి. అడవికి పోయిన పశువులు ఊర్లోకి వస్తూ వున్నాయి. ఇటుక బట్టీల నుంచి ఆఖరి దఫాగా లారీ దుమ్ము లేపుకుంటూ పోతూ వుంది. మేకల మందను గొల్ల కొమురయ్య ఊర్లోకి తోలుకొస్తూ వున్నాడు. వరి నాట్లకు వెళ్ళిన ఆడ కూలీలు ఇళ్ళకు చేరుతున్నారు. పొయ్యిల్లోకి కర్రలు అమ్మే లంబాడి స్త్రీలు తిరిగి తమ తండాకు పయనమయ్యారు. కల్లు దుకాణం పెంటయ్య రెండు సీసాల కల్లు పట్టుకుని ఎవరింటికో వెలుతున్నాడు. చేద బావి మీద గిలక చప్పుడు అదే పనిగా వినిపిస్తోంది. ఊరావల వున్న పిండి గర్ని (మర) చప్పుడు వినిపిస్తోంది. పటేలు కొడుకు సైకిల్ గంట కొడుతూ వీధిలో తిప్పుతూ వున్నాడు. ఎవరో తల్లి తన బిడ్డను కూత పెట్టి పిలుస్తోంది. సందేళ బిక్షమేయమంటూ గంగెద్దుల వాడు గంట కొడుతూ బయలు దేరాడు...

అయినప్పటికీ సరస్వతి అలాగే బిరిపోయి (మొద్దుబారి)నట్టు కూర్చుంది.

సరస్వతి మరదలు పుష్ప తల్లి కన్నా ముందుగా ఇంటి కొచ్చింది. వారం రోజుల నుంచి వదినను అన్ని గంటల పాటు చూడ కుండా వుండటం అదే రోజు. అందుకనే పరుగెత్తుకొచ్చింది. ఇంట్లో దీపం ముట్టించకుండా, సందె వాకిలి ఊడ్చకుండా కూర్చున్న తన వదినెను చూసే సరికి ఆశ్చర్య మేసింది. ఆమె కోసం ఎంతో ఉత్సాహంతో బావి దగ్గర్నుంచి తెచ్చిన గన్నేరు పూలను ఇవ్వాలన్న విషయం కూడా మరిచి పోయింది, అసలు విషయమేమిటో తెలియక.

"ఏమై ంది వొదినే?" అని అడిగింది.

"ప్చ్..." అని వూరుకుంది సరస్వతి.

వారం రోజుల నుంచి తనతో కలసి మెలసి తిరిగి, ఆడిపాడిన వదినలా అనిపించలేదు పుష్పకు.

లంగాలోని పూలను ఎదిరింట్లో పోసి, చీపిరి అందుకుని గబగబా సందె వాకిలి ఊడ్వ సాగింది పుష్ప.

ఈలోగా ఆండాలు వచ్చింది. సరస్వతి అలాగే కూర్చుంది. తన బిడ్డ వాకిలి ఊడ్వడం, కోడలు చప్పుడు లేకుండా కూర్చోవడం చూసి, కొంత ఆశ్చర్యంతో

"ఏమైయిందే పిల్ల?" కంచు కంఠంతో అడిగింది ఆండాలు.

సరస్వతి తల అడ్డంగా ఊపింది.

"మరి అట్లెందుకు కూసున్నవే?..." పరిశీలనగా చూస్తూ అంది.

సరస్వతి ఓ సారి అత్త కళ్ళలోకి చూసి ఊరుకుంది. మరే సమాధానమివ్వలేదు.

"సప్పుడు వెయ్యవేమే?..." గొంతు కొంత తగ్గించి అంది ఆండాలు. ఇంతలోకే చంద్రయ్య పశువులను తీసుకుని వచ్చాడు. అందరూ బయట వాకిట్లో వుండటం చూసి, తన భార్యనుద్దేశించి

"అట్ల నిలవడ్డరేమే?... ఆ?..." అని నోరు తెరచి, మొఖమంతా ప్రశ్నార్థకంగా అడిగాడు చంద్రయ్య.

## జీవ శిల

తమాషాగా కళ్ళు మూసుకుని
నీ వెవ్వరిని ధ్యానిస్తున్నావో
ఎవరికి నమస్కరిస్తున్నావో
నేను గుర్తించలేకుండా వున్నాను.
తెలివితేటల పూలతోటల్ని నరికి
అందాల్ని పునాదులతో పెకలించి
ప్రేమానురాగాలు చీల్చి
ఆదరించిన వారి గుండెల్లో
కన్నీరు పొంగించి
పొలాల పచ్చదనాన్ని
మంటల్లో స్నానం చేయించి
బూడిద గుట్టల మిద
కీర్తి పతాకాన్నెగరేసుకుంటూ
వినోదించే - నీ ధ్యాన
పరమార్థమేమిటో
నాకు తెలియటం లేదు!
రక్తాన్ని తీర్థంలా
ఆర్తిని ప్రసాదంలా
స్వీకరించే నీ భక్తిని చూసి
భయపడి -
అవతార పురుషులు, మహాత్ములు
ఎప్పుడో విగ్రహాలైపోయారు!
నేనే నీ కోసం
జీవ శిలగా మిగిలాను!!

—ఆచార్య తిరుమల

"మేము వచ్చే వరకు కోడలు పిల్ల సప్పుడు చేయకుండా గడప దగ్గర కూసుంది. అట్లెందుకు కూసున్నవని అడుగుతన్న ... అంతట్లకే మువ్ వొచ్చినవ్..." అంది అంత వరకు చేతిలో వున్న గోనె తట్టను విసిరేస్తూ.

చంద్రయ్య కోడలు మొఖం రెండు క్షణాలు పరిశీలనగా చూసాడు. చూసి "అయ్యో, కూసుంటే ఎమయితుందే? మువ్ బాగనే వున్నవ్... తల్లిగారింటి మీద మనసు పెట్టిందేమో? గాయింత దానికే గాబర పడితివా?..." అన్నాడు కోడలికి మద్దతునిస్తూ, తన భార్య అమాయకత్వాన్ని ఎత్తి పొడుస్తూ...

మామ మాటలకు సరస్వతి కన్నెత్తి చూసి తిరిగి యథా తథంగానే కూర్చుంది.

చంద్రయ్య పశువులను గుంజలకు కట్టేస్తూ "దీపమైతే ముట్టియింద్రి..." అన్నాడు.

పుష్ప ఇల్లు ఊడ్చి 'గూనె పెంక ' మీద దీపం పెట్టి వెలిగించింది. ఆండాలు దడి దగ్గర కెళ్ళి బురద కాళ్ళు కడుక్కుంది. కోళ్ళను కమ్మింది. పుష్ప పొయింట్లోని కుండలు దడి దగ్గరేసి, కడిగింది.

ఆండాలు అన్నం వండి, పులుసు చేసింది. సరస్వతి గడప దగ్గర్నుంచి లేచి ఎదురింట్లోకి వెళ్ళి గోడకు ఆనుకుని కూర్చుంది.

వీథిలో పిల్లలు కుంటి కుంటి కాలు ఆట ఆడుతూ వున్న చప్పుడు వినిపిస్తోంది. ఎవరో పిల్ల అదే పనిగా ఏడుస్తూ వుంది. పక్కింటి పిల్ల అన్నం గిన్నెతో వొచ్చి పులుసు వుంటే పోయమన్నది.

బావి నుంచి సాంబయ్య వచ్చాడు. వచ్చేప్పుడు బావి దగ్గర నుంచి జామపళ్ళు తెచ్చాడు. తల్లికి, చెల్లెకు తెలియకుండా తన భార్యకు ఇద్దామని వచ్చాడు. సరస్వతి మొఖం తిప్పుకుంది. సాంబయ్యకు విషయమేమిటో అర్థం కాలేదు.. జామపళ్ళు అర్రలోకి వెళ్ళి ఉట్టిలోని ముంతలో వేసి, బయటకు వచ్చి అసలు విషయం ఏమిటో కనుక్కుందామనుకున్నాడు. ఎవర్ని కనుక్కోవాలో తెలియలేదు. తల్లిని అడగడానికి కొంత సిగ్గనిపించింది. అయినప్పటికీ ధైర్యం చేసి

"నీ కోడలు అట్లుందేమే?..." అని అడిగాడు.

"ఏమో?..." అంది తల్లి.

సరస్వతి ఆ పూట తినడానికి కూడా లేవలేదు. అలాగే కూర్చుండి పోయింది. ఎంత బతిమాలినా పట్టిన పట్టు విడువలేదు.

అందరూ ఎంగిలి పడ్డారు. సాంబయ్య మాత్రం రోజు కన్నా చాల తక్కువ తిని లేచాడు.

సరస్వతి ఎదిరింట్లోనే వొరిగింది. ఆండాలు తన బిడ్డ పుష్పను సరస్వతి దగ్గరే పడుకో బెట్టింది. తాను మరో మూలకు పడుకుంది. చంద్రయ్య బయట పక్క వేసుకున్నాడు. సాంబయ్య బావి వద్దకు చిన్న బోయి వెళ్ళిపోయాడు.... ఎంత ఆలోచించినా తన భార్య మౌనం వహించడానికి కారణం ఏమిటో అర్థం కాలేదు. ఆ రాతిరంతా సాంబయ్య ఆలోచిస్తూనే వున్నాడు. క్రితం రాత్రి నిద్ర సరిగ్గా లేక పోవడంతో పడుకోగానే సరస్వతికి నిద్ర పట్టేసింది. తెల్లవారింది.

వాకిలి ఊడుస్తున్న చీపిరి చప్పుడుకు సరస్వతి మేల్కొన్నది.

సరస్వతి ఆరోజు సైతం మౌనవ్రతమే పాటించింది. ఎవ్వరు అడిగినా సమాధానమే లేదు. పక్కింటి మునలమ్మలు వచ్చి పలకరించి, విషయమేమిటో అడిగినా పల్లెత్తి మాట్లాడలేదు- ఒకరికి నలుగురు వచ్చి అడగడంతో సరస్వతికి కోపం వచ్చింది. దాంతో వచ్చిన వాళ్ళపై విసుక్కోసాగింది.

సరస్వతి అలకకు, మౌనానికి కారణం పదిమంది పది రకాలుగా చెప్పుకున్నారు. కొన్నింటిని సరస్వతి విన్నప్పటికీ నాలుక విప్పలేదు.

పొలం వద్ద సాంబయ్య మనసు మనసులో లేదు. నాగటి సాలు వంకర పోయింది. పాలు పిండినా ధారలు కొన్ని క్రింద భూమిపై పడ్డాయి. ఆ రోజంతా పరధ్యానంలోనే గడిచిపోయింది.

చాలామంది మాత్రం "పిల్ల తల్లిగారింటి మీద మనసు పెట్టింది. వొచ్చి వారం దినాలయిందో కాలేదో అప్పడే అవ్వ గుర్తొచ్చినాదే బిడ్డా?..." అంటూ దీర్ఘాలు తీసి, అసలు రహస్యాన్ని ఛేదించినట్టు ఆ విషయాన్ని ఆండాలుతో చెప్పి వెళ్ళారు.


ఆ మరుసటిరోజు చంద్రయ్య కొత్తబట్టలు కట్టుకుని, కోడలు సరస్వతిని వెంట దీసుకుని తన వియ్యంకుడి యింటికి పయనమయ్యాడు. పోతున్న భార్యను బావిగట్టుమించి చూసిన సాంబయ్య కూతపెట్టడానికి కుడిచేయి నోటివరకొచ్చింది. కాని తండ్రి వింటాడని ఊరుకున్నాడు.

*** *** ***

సరస్వతి ఐదు నెలల నుంచి సింగాయపల్లిలో తల్లి దగ్గరే వుంటోంది. తన స్నేహితులతో, పిల్లలతో చిటికి బిళ్ళ దగ్గర్నుంచి, కుంటి కుంటి కాలు వరకు, కుండలాట నుంచి, దొంగాట వరకూ ఆడుతూ పాడుతూనే వుంది. తనకు పూర్తి స్వేచ్ఛ దొరికినంతగా సంబరపడిపోయి, మనసు తీరా ఆడింది, పాడింది, తిరిగింది-



రచయిత, కార్టూనిస్ట్, కవి 'ప్రషాడార్క్' సిల్వర్ మర్చెంట్ 'పాముల్ని ఎవరేనా పట్టుకోవచ్చు భయం లేకపోతే' అంటున్నాడు! మీరేమంటారు?




ఈ ఐదు నెలల్లో ఓసారి తన పెద్దమ్మ వాళ్ళ ఊరికి వెళ్ళి వచ్చింది. అక్కడ అనేక పండ్లు, కాయలు తెంపింది, తిన్నది- పువ్వులు కోసింది, పూజలు చేసింది.

మొన్ననే జరిగిన బతకమ్మ పండగకు ఊరుఊరంతా కలియతిరిగి బతకమ్మ ఆడింది, గౌరమ్మ పాటలూ పాడింది- మనసు ఎంత హాయిగా వుందో? అనుకున్న వన్నీ నెరవేరుతున్నట్టుగా వుంది.

ఓ రోజు పక్కింటి తిరుపతమ్మ బిడ్డను కన్నదని తెలిస్తే తల్లితోపాటు తనూ వెళ్ళింది. నెలరోజుల క్రితం చూసిన తిరుపతమ్మకు, ఇప్పుడు చూస్తున్న తిరుపతమ్మకు పోలిక లేదనిపించింది సరస్వతికి- తిరుపతమ్మ మొఖం పసుపురాసినట్టుగా మెరుస్తోంది. రొమ్ములు బాగా పొంగి వున్నాయి. గొంతు పగిలింది.

తిరుపతమ్మ తనకన్నా రెండేళ్ళే పెద్ద అని తన తల్లి అనేక మార్లు చెప్పింది. తన కన్నా రెండేళ్ళు పెద్దయిన తిరుపతమ్మ పొత్తిళ్ళలో వున్న పసికందు ఏడుస్తూ వుంటే, రొమ్ము అందివ్వగానే ఏడుపు మానేసింది... పాలిచ్చేప్పుడు తిరుపతమ్మ మొఖంలో ఆనందం కొట్టొచ్చినట్టు కనిపించింది. అంతక్రితం చాలా మంది తల్లులు పిల్లలకు పాలివ్వడం చూసినా, ఎందుకో తిరుపతమ్మను చూసిన తరువాత బావిలో రాయి వేసినట్టు అనిపించింది... ఎక్కడో గురిచూసి కొడితే ఆలోచనలన్నీ చెల్లాచెదు రయినట్టనిపించింది. మనసంతా అల్లకల్లోలమయింది.

ఆ రోజు సరస్వతి కళ్ళనిండా తిరుపతమ్మే కనిపించసాగింది. ఆమె పక్కలోని పసిపాప ఏడుపే చెవులకు వినిపిస్తోంది- రాత్రి నిద్ర పట్టలేదు- కళ్ళు మూసుకున్నా, తెరిచినా తిరుపతమ్మ రూపం, పసిపాప ఆకారం... ఆమె పాలిస్తున్న తీరు, ఏడ్పుమానిన పసికందు, పసుపురాసినట్టుగా వున్న ఆమె మొఖం, ఎర్రగా గన్నేరు పువ్వులా పసిగుడ్డు... ఆ యింట్లోని పురిటి వాసన... మూలన ఆముదం దీపం ... కాగులు, కుండలు... పాత సామాను...

అనుకోకుండా తన ఆలోచనలు తన భర్త యింటి వైపుకు మరలాయి. అలాగే భర్త యింటి నుంచి వచ్చాక తన తల్లి చెప్పిన అనేక విషయాలు ఒక్కొక్కటే అర్థమవుతున్నట్టనిపిస్తోంది... అనుకోకుండానే చెట్టంత మనిషి తన భర్త ఆకారం తన కళ్ళముందు కదులాడింది. అర్రగాని, కుండలుగాని, పెట్టెలు గాని, గుమ్మిగాని ఏవీ జ్ఞాపకం రావడం లేదు. సరస్వతికి చెట్టంత మనిషి తన భర్త సాంబయ్య మాత్రమే, అతని ఆకారం మాత్రమే గుర్తుకొస్తున్నాయి. ●

